క్లుప్తంగా

ఆంజనేయస్వామికి విశేష పూజలు



విశేషాలంకరణలో ఆంజనేయస్వామి

పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న వీర అభయాంజనేయస్వామికి మంగళవారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు, పూజలు, సాయంత్రం పల్లకిసేవ గావించారు.

ప్లేట్లు, నోట్సుల వితరణ



కొడవలూరు: మండలంలోని రామాపురం గిరిజన కాలనీ ప్రాథమిక పాఠశాలలోని 50 మంది గిరిజన విద్యార్థులకు బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన సహారా ఎడ్యుకేనల్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ప్లేట్‌లు, వాటర్ బాటిళ్లు, నోట్సులు పంపిణీ చేశారు. వీటిని ఎంఈఓ–2 ఎస్.అంకయ్య చేతుల మీదుగా మంగళవారం అందజేశారు. అనంతరం హెచ్‌ఎం గౌస్‌బాషా మాట్లాడుతూ సహార ఎడ్యుకేషనల్ సొసైటీ వారు పేద విద్యార్థులకు సాయపడడం అభినందనీయమన్నారు. సొసైటీ అధ్యక్షుడు యస్దానిబాషా మాట్లాడుతూ కార్యక్రమానికి సహాయ, సహకారాలందించిన శీనయ్య, నవీన్, నరసయ్యలను అభినందించారు. పేరెంట్స్ కమిటీ సభ్యులు పఠాన్ రంతుల్లా, ఉపాధ్యాయులు సి.మాధవి, పి.రేచల్ సుహాసిని, సీఆర్పీ ఎం.దయాకర్ పాల్గొన్నారు.

మతోన్మాదులపై చర్యలు తీసుకోవాలి



ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

బుచ్చిరెడ్డిపాళెం: మతోన్మాదులపై కేంద్ర ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలని వివిధ క్రైస్తవ సంఘాల పాస్టర్లు డిమాండ్ చేశారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలో సేవ్ మణిపూర్ పేరిట మంగళవారం యునైటెడ్ క్రిస్టియన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. బుచ్చిరెడ్డిపాళెం, సంగం, దగదర్తి మండలాల నుంచి వచ్చిన క్రైస్తవులు వైఎస్సార్ విగ్రహం, అంబేడ్కర్ విగ్రహాల మీదుగా ర్యాలీ చేపట్టి రెవెన్యూ కార్యాలయానికి చేరుకుని తహసీల్దార్ సుధీర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పాస్టర్లు మాట్లాడుతూ మణిపూర్‌లో జరుగుతున్న దారుణాలను కట్టడి చేయాలన్నారు. కార్యక్రమంలో పాస్టర్లు పత్రి దేవదానం, జాన్సన్, ప్రభుకుమార్, జాన్‌పాల్, రవి, ఏజ్రా, సురేంద్ర, మనోహర్, రవికుమార్, పేతురు పాల్గొన్నారు.

30న చండీ హోమం

నెల్లూరు(బృందావనం): నిజ శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకొని మూలాపేటలోని శంకరమఠంలో చండీహోమాన్ని ఈ నెల 30వ తేదీ ఉదయం తొమ్మిది నుంచి నిర్వహించనున్నామని మఠం నిర్వాహకులు నందకిశోర్, ఉషాకుమారి దంపతులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హోమంలో పాల్గొనాలనుకునే వారు 96528 60264, 99499 18358 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

హెల్మెట్ వినియోగంపై విస్తృత అవగాహన

నెల్లూరు(క్రైమ్): హెల్మెట్ వినియోగంపై అవగాహన కార్యక్రమాలను పోలీస్ అధికారులు నిర్వహిస్తున్నారు. ద్విచక్రవాహన ప్రమాదాల్లో అధిక శాతం మంది తలకు తీవ్రగాయాలై మరణిస్తున్నారు. హెల్మెట్‌ను ధరిస్తే కనీసం గాయాలతోనైనా బయటపడేందుకు అవకాశం ఉంటుంది. ఫలితంగా చిన్నపాటి నిర్లక్ష్యంతో విలువైన ప్రాణాలను కోల్పోతున్నారు. ఈ నేపథ్యంలో హెల్మెట్ వినియోగంపై ద్విచక్ర వాహనచోదకులకు విస్తృత అవగాహన కల్పించి.. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించేలా చర్యలు చేపట్టాలని ఎస్పీ తిరుమలేశ్వర రెడ్డి ఆదేశించారు. ఈ నేపథ్యంలో హెల్మెట్‌తో ప్రాణాలు భద్రం అనే నినాదంతో అవగాహన కార్యక్రమాలను నగర ట్రాఫిక్ డీఎస్పీ అబ్దుల్ సుభాన్ పర్యవేక్షణలో ట్రాఫిక్ అధికారులు చేపట్టారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్‌ను విధిగా ధరించాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. మరోవైపు హెల్మెట్ ధరించకపోవడంతో సంభవించే అనర్థాలు, అధిక వేగం ప్రమాదానికి మూలం అనే నినాదాలతో నగరంలోని అన్ని ప్రధాన కూడళ్లలో పోస్టర్లు, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లను ఏర్పాటు చేశారు.

పీహెచ్‌సీల్లో నిరంతర వైద్యసేవలు

- 24 గంటల పాటు సేవలు అందించేలా చర్యలు

కోవూరు : రాష్ట్ర ప్రభుత్వం వైద్యరంగ బలోపేతానికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఇందులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో సైతం మెరుగైన వైద్యం అందించాలని ఇప్పటికే పీహెచ్‌సీల్లో సరిపడా సిబ్బందిని నియమించింది. కాగా మరో అడుగు ముందుకేసి ఇకపై 24 గంటల పాటు పీహెచ్‌సీల్లో వైద్యం అందించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే వైద్యశాలలను నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రైవేటు, కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారు. అన్నిరకాల వసతులను సమకూర్చారు. గ్రామీణ ప్రజలకు వైద్యం చేరువ చేసేందుకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని అమల్లోకి తెచ్చారు. తాజాగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 24 గంటలు వైద్యసేవలు అందించాలన్న ఆలోచనతో గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్యం మరింత చేశారు.

ప్రతి పీహెచ్‌సీ 14 మంది సిబ్బంది

కోవూరు నియోజకవర్గంలో జొన్నవాడ, ఇనమడుగు, యల్లాయపాళెం, కొడవలూరు, రామతీర్థం, విడవలూరు, ఇందుకూరుపేట ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ప్రతి పీహెచ్‌సీలో 14 మంది సిబ్బంది, ఇద్దరు వైద్యులు అందుబాటులో ఉంటారు. ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో అంతకంటే ఎక్కువ మంది వైద్యసేవలు అందిస్తున్నారు. కాగా ప్రస్తుతం ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 24 గంటల ఆస్పత్రిగా ప్రభుత్వం మార్పు చేసింది.



పీహెచ్‌సీలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్

కోవూరు నియోజకవర్గ పరిధిలో	
పీహెచ్‌సీలు	7
కాన్పులు	34 (నాలుగు నెలల్లో)
ఓపీ	40-50 (రోజుకు)

దీని ద్వారా ఆరోగ్య కేంద్రాల్లో స్టాఫ్ నర్సులు మూడు షిఫ్టుల్లో పనిచేయాల్సి ఉంటుంది. గతంలో సాయంత్రం 4 గంటలు దాటితే అన్ని ఆస్పత్రులు మూతపడేవి. దీంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారన్న ఆలోచనతో ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను మరింత బలోపేతం చేసింది.



ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ఆదేశాలు వచ్చాయి



అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 24 గంటలూ పనిచేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. రాత్రి వేళలో కూడా వైద్యసేవలు అందేలా చూస్తున్నాం. కాన్పులు తదితర చికిత్సల విషయంలో జాగ్రత్తలు తీసుకుంటున్నాం. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించడానికి కృషి చేస్తున్నాం.

– డాక్టర్ ఇర్ఫాన్, ఇనమడుగు పీహెచ్‌సీ

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 24 గంటల వైద్య సేవలు అందించాలన్న ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం. గత ప్రభుత్వ హయంలో ప్రభుత్వ ఆస్పత్రులు సరిగ్గా పనిచేసేవి కాదు. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చిన తరువాత గ్రామీణ ప్రాంతాల్లోనే మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయి.



– కె.శివేంద్రబాబు, కోవూరు

కొత్త మందుల వల్లే నిమ్మకు తెగుళ్లు



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాసులురెడ్డి

- ఎంటమాలజిస్ట్ డాక్టర్ శ్రీనివాసులురెడ్డి

పొదలకూరు : రైతులు నిమ్మతోటలకు కొత్తరకం మందుల వాడకం వల్లనే తెగుళ్లు పెరుగుతున్నట్లు తిరుపతి సిట్రస్ పరిశోధన స్థానం ఎంటమాలజిస్ట్(కీటకశాస్త్రం) డాక్టర్ శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. పొదలకూరు నిమ్మమార్కెట్ యార్డులో ఉద్యానశాఖ ఆధ్వర్యంలో నిమ్మ తోటల్లో చీడపీడల నివారణ, డ్రిప్ ద్వారా ఎరువుల యాజమాన్యంపై మంగళవారం రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సదస్సుకు హాజరైన శాస్త్రవేత్త శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ రైతులు మార్కెట్లో వచ్చే కొత్తరకం పురుగు మందులను ఇష్టానుసారం వాడవద్దని సూచించారు. నిమ్మకు మంగు తెగుల వల్ల తీవ్రనష్టం వాటిల్లుతున్నట్లు తెలిపారు. దీనివల్ల కాయ 30 నుంచి 70 శాతం దెబ్బతిని, మార్కెట్లో ధర లేకుండాపోతున్నట్లు చెప్పారు. పెట్లూరు నిమ్మ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ కమిత మాట్లాడుతూ రైతులు శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు లేకుండా మందుల పిచికారీ చేయవద్దన్నారు. వేసవి కాలంలో నిమ్మ దిగుబడి పెరిగేందుకు పరిశోధనలు చేసినట్లు తెలిపారు. జిల్లా ఉద్యానాధికారి సుబ్బారెడ్డి మాట్లాడుతూ నిమ్మతోటల సాగు సులభం కాదని, ఈ ప్రాంతంలో రైతులు నిమ్మసాగుకు అలవాటు పడి తెగుళ్లను సమర్థవంతంగా ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. వేసవికాలంలో నిమ్మ దిగుబడి చేసుకునేందుకు చాలా పరిశోధనలు జరిగినట్లు పేర్కొన్నారు. ఏపీఎంఐపీ పీడీ బి.శ్రీనివాసులు మాట్లాడుతూ డ్రిప్‌పైపుల ద్వారా నిమ్మతోటలకు ఎరువుల వాడకంపై రైతులు అవగాహన పెంచుకోవాల్సిందిగా సూచించారు. కావలి డివిజన్లో ఇసుక నేలల్లో సూక్ష్మసేద్యం ద్వారా వేరుశనగ పండిస్తున్నట్లు తెలిపారు. సూక్ష్మసేద్యం కోసం రైతులకు రాయితీలను అందజేస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా పేర్కొన్నారు. జిల్లాలో పేరున్న ఏడు కంపెనీల పైపులను అమరుస్తామన్నారు. ఈ సదస్సులో పొదలకూరు ఉద్యానాధికారి ఈ.ఆనంద్, జెడ్పీటీసీ సభ్యురాలు తెనాలి నిర్మలమ్మ, మార్కెట్ అసోసియేషన్ సెక్రటరీ అట్ల ప్రభాకర్‌రెడ్డి, మాజీ సీడీసీ చైర్మన్ పెదమల్లు రమణారెడ్డి, ఏఏబీ సభ్యుడు వెన్నపూస దయాకర్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు ఎం.బాలకృష్ణారెడ్డి, కె.రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బేషుగ్గా ఇంటింటి ఓటర్ల సర్వే

- ఈఆర్వో రాజా రమేష్ ప్రేమ్‌కుమార్

కొడవలూరు : బీఎల్వోలు చేస్తున్న ఇంటింటి ఓటర్ల సర్వే బేషుగ్గా ఉందని కోవూరు నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్(ఈఆర్వో) రాజా రమేష్ ప్రేమ్‌కుమార్ ప్రశంసించారు. మండలంలోని నార్త్ రాజుపాళెంలో ఉన్న ఎనిమిది పోలింగ్ స్టేషన్‌లను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఎల్వోలు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే ద్వారా ఓటర్ల జాబితా పారదర్శకంగా రూపొందుతుందన్నారు. మృతుల ఓట్లను తొలగించడంతో పాటు కొత్త ఓటర్ల చేరిక, సవరణలు ఎంతో పారదర్శకంగా ఉంటున్నాయని చెప్పారు. సర్వేలో బీఎల్వోలు చూపుతున్న పనితీరు ఎంతో బాగుందన్నారు. పోలింగ్ స్టేషన్‌లలోనూ అన్ని వసతులు సమృద్ధిగా ఉన్నాయని చెప్పారు. గ్రామ బీఎల్వోలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఆయన వెంట తహసీల్దార్ ఈ.రమాదేవి, డీటీ గున్నం మల్లికార్జున, బీఎల్వోలు ఎ.ప్రియదర్శిని, ఎం.మల్లికార్జున ఉన్నారు.



బీఎల్వోలకు సూచనలిస్తున్న ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్

హెచ్‌ఎంకు ప్రశంసాపత్రం

కొడవలూరు: మండలంలోని వెంకన్నపురం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంకు ప్రశంసా పత్రం లభించింది. 'డిజిటల్ టెక్నాలజీ ఫర్ స్కూల్ టీచర్ ఎడ్యుకేషన్' అనే అంశంపై ఎస్‌సీఈఆర్టీ, సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ టెక్నాలజీ సంయుక్తంగా ఈనెల 7 నుంచి 11వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో హెచ్‌ఎం పాల్గొని ఆన్‌లైన్‌లో నిర్వహించిన పరీక్షలో ప్రతిభ కనబరిచారు. ఇందుకు గానూ ఎస్‌సీఈఆర్టీ జేడీ, కోఆర్డినేటర్‌లు బి.అమరేంద్ర, ఎ.రత్నబాబులు హెచ్‌ఎం వెంకటేశ్వర్లుకు ఆన్‌లైన్‌లో ప్రశంసా పత్రం పంపారు. దీనిని ఎంఈఓ జి.వసంతకుమారి చేతుల మీదుగా మంగళవారం హెచ్‌ఎం అందుకున్నారు.



ప్రశంసా పత్రం అందుకుంటున్న హెచ్‌ఎం వెంకటేశ్వర్లు

బాల్య వివాహాలను అరికట్టాలి

ఇందుకూరుపేట : బాల్య వివాహాలను అరికట్టడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అమ్మణమ్మ అన్నారు. మండలంలోని ఇందుకూరుపేట ఎస్టీకాలనీలో బాల్య వివాహాలపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 ఏళ్లలోపు బాలికకు వివాహం చేసినా, ప్రోత్సహించినా వారికి రెండేళ్ల జైలు శిక్ష ఉంటుందన్నారు. వరుడికి రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.లక్ష జరిమానా విధిస్తామన్నారు. వీటిపై సమాచారం ఉంటే అధికారులకు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానికులు ఆదిశేషయ్య, మురళీ, అంగనవాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ అమ్మణమ్మ

నేడు రెండో వార్డులో 'గడప గడపకు..'

- పాల్గొననున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం : నగర పంచాయతీ పరిధిలోని రెండో వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం బుధవారం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ కన్వీనర్లు చెర్లో సతీష్‌రెడ్డి, టంగుటూరు మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పాల్గొని, ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరించడంతో పాటు స్థానిక సమస్యలను తెలుసుకుంటారన్నారు.

ఎమ్మెల్‌హెచ్‌పీలు స్థానికంగా నివాసం ఉండాలి

- మండల వైద్యాధికారి డాక్టర్ రమేష్

పొదలకూరు : ఎంఎల్‌హెచ్‌పీ(మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్)లు స్థానికంగా నివాసం ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ ఎం.రమేష్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌లలో ఎంఎల్‌హెచ్‌పీలు ఉంటున్నారని, ప్రభుత్వం వీరి ప్రాధాన్యతను గుర్తించి ఆయా గ్రామాల్లో స్థానికంగా నివాసం ఏర్పాటు చేసుకోవాల్సిందిగా ఉత్తర్వులు ఇచ్చినట్లు చెప్పారు. మండలంలో 22 హెల్త్‌క్లినిక్‌లు ఉన్నాయని, వాటి ద్వారా 54 రకాల మందులను గ్రామస్తులకు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. ఎంఎల్‌హెచ్‌పీలు స్థానికంగా నివాసం ఉంటున్నట్లు సర్పంచ్‌లు నిర్ధారించాలన్నారు. ప్రతినిత్యం ఉయదం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విలేజ్ క్లినిక్‌లలో ఎంఎల్‌హెచ్‌పీలు అందుబాటులో ఉంటూ చుట్టుపక్కల నుంచి వచ్చే రోగులకు ప్రాథమిక పరీక్షలు నిర్వహించి మందులను అందజేయాల్సి ఉంటుందన్నారు. ప్రధానంగా బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేస్తున్నట్లు వైద్యాధికారి వెల్లడించారు. విలేజ్ క్లినిక్‌లలో వారు అందుబాటులో లేకుంటే చర్యలు తీసుకుంటామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

బుచ్చిరెడ్డిపాళెం : రోడ్డు ప్రమాదంలో చాన్‌బాషా అనే వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన బుచ్చిరెడ్డిపాళెంలోని జమీలా హాల్ వద్ద సోమవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన చాన్‌బాషా సైకిల్‌పై వెళ్తుండగా వెనుక నుంచి వస్తున్న గుర్తుతెలియని వాహనం వేగంగా ఢీకొని వెళ్లిపోయింది. ఈ క్రమంలో రోడ్డు మీద పడిన చాన్‌బాషా కాలుపై లారీ వెళ్లింది. దీంతో తీవ్రగాయాలు కావడంతో అతన్ని చికిత్స నిమిత్తం బుచ్చిరెడ్డిపాళెం సీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. అయితే దీనిపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం



ఇందుకూరుపేట : మండలంలోని ముదివర్తిపాళెం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను నరసాపురం వద్ద మంగళవారం స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ బాలకృష్ణ తెలిపారు. డ్రైవర్ సందీప్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు. ఈ దాడుల్లో హెడ్‌కానిస్టేబుల్ సతీష్, రామకృష్ణ పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉంటా



చిన్నారులకు ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్లను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమారెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం : తల్లిని కోల్పోయిన చిన్నారులకు, దివ్యాంగులైన వారికి అండగా ఉంటానని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమారెడ్డి అన్నారు. ఇందులో భాగంగా బుచ్చిరెడ్డిపాళెంలోని గాంధీనగర్‌కు చెందిన షేక్ రసూలమ్మ, షేక్ రహమతున్నీసా తల్లిని కోల్పోయి విద్యను అభ్యసించడం కష్టంగా మారింది. ఈ విషయం తెలుసుకున్న కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తన తండ్రి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి ట్రస్ట్ ద్వారా ఇద్దరు పిల్లలకు రూ.20 వేల చొప్పున ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేసి బాండ్‌లను బుచ్చిరెడ్డిపాళెంలో మంగళవారం అందజేశారు. అలాగే కోదండరామపురానికి చెందిన వడ్డి పద్మావతి దివ్యాంగురాలు కావడంతో ఆమెకు ఎన్‌ఎన్నార్ ట్రస్ట్ ద్వారా రూ.35 వేలు విలువ చేసే బ్యాటరీ ట్రై సైకిల్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు షకీలాబేగం, శివకుమార్‌రెడ్డి, మల్లారెడ్డి, యానాదిరెడ్డి, చీర్ల ప్రసాద్, జయంతి, శ్రీదేవి, పార్టీ నేతలు పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, మోర్ల మురళీ, మేనకూరు సీతారామిరెడ్డి, మధుసూదన్ రెడ్డి, విల్సన్, చలపతి, నారాయణ, అల్లాభక్షు, చాందిని, ప్రవళ్లిక, భరత్ పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు

- కలెక్టర్ హరినారాయణన్

వెంకటాచలం : వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అవసరమైన అన్నిచర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. మండలంలోని గొలగమూడిలో ఉన్న భగవాన్ శ్రీవెంకయ్యస్వామి ఆశ్రమాన్ని కలెక్టర్ మంగళవారం సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. తొలుత ఆశ్రమానికి వచ్చిన కలెక్టర్‌ను ఈఓ పి.బాలసుబ్రహ్మణ్యం శాలువాతో సత్కరించారు. అనంతరం ఆశ్రమ పరిసరాలను, అన్నదాన సత్రాన్ని పరిశీలించారు. ఆరాధనోత్సవాల్లో భక్తులకు కల్పిస్తున్న వసతులపై ఈఓను అడిగి తెలుసుకున్నారు. వచ్చే గురువారం రథోత్సవం సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై పోలీసు, రెవెన్యూ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించి, పలు సూచనలు చేశారు. ఆశ్రమం వద్ద క్యూ లైన్లు, దుకాణాల ఏర్పాటు, భక్తుల ప్రవేశ మార్గాలు తదితర అంశాల గురించి ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. రోడ్డుకు ఓ వైపు మాత్రమే దుకాణాలు ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఆయన వెంట ఆర్డీఓ మలోల, డీఎస్పీ వీరాంజనేయరెడ్డి, డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వెంకయ్యస్వామి ఆశ్రమంలో పూజలు చేస్తున్న కలెక్టర్

మేలుజాతి పశువుల ఉత్పత్తే లక్ష్యం

కోవూరు : పెయ్యదూడల ఉత్పత్తి పథకంలో భాగంగా మేలుజాతి పశువుల ఉత్పత్తే లక్ష్యంగా ప్రభుత్వం ఆలోచిస్తోందని ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్ అన్నారు. కోవూరు పశువైద్యశాల ప్రాంతీయ కార్యాలయంలో మంగళవారం 15 మంది రైతులకు మినరల్ మిక్చర్ ప్యాకెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ 2023–24 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో 60 వేల పెయ్యదూడల ఉత్పత్తే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలో కోవూరు, ఇందుకూరుపేట, బుచ్చిరెడ్డిపాళెం మండలాల్లో లింగ నిర్ధారిత వీర్యం ద్వారా ఆడదూడలు–ముర్రజాతి, జెర్సీ క్రాస్, హెచ్‌ఎఫ్ క్రాస్, గిరి, సాహివాల్ జాతి పశువులతో పాల ఉత్పత్తి పెంచాలన్నారు. అలాగే రైతులకు గిట్టుబాటు ధర కోసం జగనన్న పాలవెల్లువ కార్యక్రమం అమలు చేయనున్నట్లు తెలిపారు. ఏడీ సోమయ్య మాట్లాడుతూ పది ప్రాంతీయ పశువైద్యశాల పరిధిలో పెయ్యదూడల ఉత్పత్తి పథకం ద్వారా పశువుల ప్రదర్శన, గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాలను నిర్వహించి దాదాపు 3 వేల పశువులకు లింగ నిర్ధారిత వీర్యం ద్వారా చూడు కట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అనంతరం 24 పశువులకు గైనకాలజిస్టు స్పెషలిస్టు డాక్టర్ కృష్ణమౌర్య వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో పశు రైతులు, పశువైద్య సహాయకులు, పశువైద్య సిబ్బంది, గ్రామ పెద్దలు తదితరులు ఉన్నారు.



రైతుకు మినరల్ మిక్సర్ అందజేస్తున్న డీఎల్‌డీఏ చైర్మన్ విజయ్‌కుమార్

రైతు సేవలో రాజీపడొద్దు

- డీసీఓ సుధాభారతి

ముత్తుకూరు : రైతు సేవలో ఎటువంటి రాజీపడొద్దని జిల్లా కో–ఆపరేటివ్ ఆఫీసర్ సుధాభారతి అన్నారు. ముత్తుకూరులోని కృష్ణపట్నం ప్రాథమిక సహకార సంఘాన్ని, తాళ్లపూడిలోని గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాన్ని మంగళవారం ఆమె పరిశీలించారు. కార్యాలయాల్లో అమర్చిన డిస్‌ప్లేల పట్ల సంతోషం వెలిబుచ్చారు. అనంతరం సచివాలయ, ఆర్బీకే ఉద్యోగులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రైతుల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తోందని తెలిపారు. రైతులకు అవసరమైన సౌకర్యాలు, సేవలు సకాలంలో అందించాలని పేర్కొన్నారు. అనంతరం స్థానిక రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం అందించే పథకాలపై ఆరా తీశారు.



తాళ్లపూడి ఆర్బీకేను పరిశీలిస్తున్న డీసీఓ సుధాభారతి

'ఈ వీఓఏ మాకొద్దు'

కోవూరు : మండలంలోని గుమ్మళ్లదిబ్బ ప్రాంతంలో సంఘబంధాల్లో నెలకొన్న సమస్యలపై వీఓఏ వెంకటలక్ష్మి కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో డీఆర్‌డీఏ అధికారులు కామాక్షయ్య, భానుప్రసాద్ గ్రామంలో మంగళవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఎనిమిదో సంఘబంధ సభ్యులు మాట్లాడుతూ ఈ వీఓఏ మాకొద్దని, సక్రమంగా పనిచేయడం లేదని తెలిపారు. అంతేకాకుండా రుణాల విషయంలో జాప్యం చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. గుమ్మళ్లదిబ్బ ప్రాంతంలో ఎక్కువ గిరిజన సంఘాలు ఉన్నాయని, వీరి వరకు ఒక వీఓఏను నియమించాలని కోరారు. అనంతరం విచారణాధికారులు కామాక్షయ్య, భానుప్రసాద్ మాట్లాడుతూ ఎనిమిదో సంఘబంధంలో ఉన్న సమస్యలను పరిష్కరించడం కోసం అన్ని సంఘాల వారిని సమావేశానికి రావాలని కోరామని, అయితే 35 సంఘాల అధ్యక్షులు సమావేశానికి వచ్చారని తెలిపారు. అందులో ముగ్గురు మాత్రం వెంకటలక్ష్మి వీఓఏగా కావాలని, మిగిలిన 32 సంఘాల అధ్యక్షులు నూతన వీఓఏను నియమించాలని కోరినట్లు చెప్పారు. దీనిని జిల్లా అధికారులకు వివరిస్తామని, వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు చేపడుతామన్నారు. సమావేశంలో సంఘమిత్ర అధ్యక్ష, కార్యదర్శులు సుగుణమ్మ, ధనమ్మ, అరుణ, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



సంఘబంధ సభ్యులతో మాట్లాడుతున్న విచారణాధికారులు

వేదగిరిలో విశేష పూజలు

నెల్లూరు రూరల్: స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకొని నరసింహకొండపై కొలువైన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో స్వామి, ఆదిలక్ష్మి అమ్మవారికి విశేష పూజలను మంగళవారం నిర్వహించారు. తిరుప్పావై సేవను భక్తిశ్రద్ధలతో జరిపారు. కల్కి జయంతిని పురస్కరించుకొని కల్కి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

